క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు.

పారిశ్రామికవేత్త పాండురంగారెడ్డి మృతి


పాండురంగారెడ్డి (ఫైల్)

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామానికి చెందిన మురళీమోహన్ బాయిల్డ్ రైస్ మిల్ అధినేత చింతా పాండురంగారెడ్డి (72) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పందలపాక సర్పంచ్ సబ్బారపు పద్మావతి, ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి(చిన్నబుజ్జి), లేఖరు సబ్బారపు ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు. పాండు రంగారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల గుర్తింపు


జి.మామిడాడలో సర్వే చేస్తున్న అధికారులు

పెదపూడి: మండలంలో 14 మంది ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించామని ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాలపై మండలంలో ప్రత్యేక అవసరాల గల పిల్లల గుర్తింపు సర్వేను ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు జ్యోతి, తేజస్వి నేతృత్వంలో ఈ నెల 9వ తేదీ వరకూ నిర్వహించామన్నారు. మండలంలో వినికిడి లోపం, దృష్టి లోపం, మానసిక ఎదుగుదల లోపం, తలసేమియా, చలన వైకల్యం వంటి 14 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లు, గ్రామ సచివాలయాల ద్వారా గుర్తించామన్నారు. బడి మానేసిన వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించామన్నారు.

14న క్యాంపస్ ఇంటర్వ్యూలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దివీస్ ల్యాబ్ క్యాంపస్ ఇంటర్వ్యూలు స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 14న జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి జరిగే ఈ ఇంటర్వ్యూలకు 2020 నుంచి 2024 వరకూ బీఎస్సీలో కెమిస్ట్రీ, బీ-ఫార్మసీ, ఎంఎస్సీలో(ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ). ఎం-ఫార్మసీలో (క్యూఏ అండ్ ఆర్ఏ). బీటెక్ కెమికల్ డిగ్రీల్లో ఉత్తీర్ణత పొందినవారు అర్హులని వివరించారు. సూపర్‌వైజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

రంగులేని బతుకులు

- భవనాలకు అందాన్నిచ్చే శ్రామికులు
- అరకొర పనులతో పెయింటర్లకు తిప్పలు
- చాలీచాలని ఆదాయంతో జీవన భారం

మధురపూడి: భవనాలకు అందం, ఆకర్షణ వాటికున్న రంగుల ద్వారానే వస్తుంది. తమ ఇంటిని పది మందీ మెచ్చుకోవాలని యజమానులు ఆశిస్తుంటారు. ఆకట్టుకునేలా రంగులు వేస్తేనే ఆ ఇంటి అందం రెట్టింపవుతుంది. వాటిని అలా తీర్చిదిద్దడంలో పెయింటర్ల పాత్ర దాగి ఉంటుంది. వారి శ్రమ, చెమటను ధారపోస్తేనే.. ఆ ఇంటి సోయగాలు ప్రస్ఫుటమవుతాయి.

భవనాలకు రంగుల ద్వారా అందాన్ని తీసుకురావడంలో కార్మికుల(పెయింటర్ల) పాత్ర కీలకంగా ఉంటుంది,.ఎండలు బాగా ఉంటే చాలు వీరి పనికి అనువుగా ఉంటుంది. రంగులద్దే వారికి వేసవి అనువైన సీజన్, భవన సముదాయాలకు చూడముచ్చటగా అందాన్ని తీసుకురావడంలోనే వీరి సామర్థ్యం కనిపిస్తుంది. ఆకాశానికి ఎగబాకిన భవనాలు సైతం వీరి ప్రతిభకు దాసోహమవ్వాల్సిందే.

వీరి ఉనికి ఇలా..

తూర్పుగోదావరి జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు లక్ష మంది ఉన్నట్టు అంచనా. వీరిలో పెయింటర్లు సుమారు 18 వేల మంది ఉన్నారు. కాగా మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో వీరి సంఖ్య 8 వేల వరకు ఉంది.


బూరుగుపూడి సచివాలయానికి రంగులు వేస్తున్న పెయింటర్లు (ఫైల్)

ప్రమాదాలకు ఎదురీదుతూ..

వీరు పనిచేసే చోట్ల కొన్ని సందర్భాల్లో అపాయకర పరిస్థితులు ఎదురవుతుంటాయి. భవనం ఎంత ఎత్తులో ఉన్నా, వీరు అలవోకగా పనిచేస్తుంటారు. ప్రమాదాలకు ఎదురీదుతూ భవనాలకు రంగులు అద్దుతారు. పెద్ద భవనాలు, భవన సముదాయాలకు రంగులద్దే సమయంలోనే ఎక్కువగా ప్రమాదాలు ఎదురవుతుంటాయి. ఎత్తయిన కట్టడాలను తాడు సాయంతో పైకి ఎగబాకుతూ రంగులు వేస్తారు. పెయింటింగ్‌లో వాడే ఎనామిల్ వల్ల వీరికి వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువ. అధికంగా శ్వాసకోశ సంబంధ వ్యాధులకు గురవుతుంటారు. కంట్లో రంగులు, వ్యర్థ పదార్థాలు పడినా దృష్టి సమస్య తప్పదు. సాధారణంగా వీరికి ఏడాదిలో వేసవి, శీతాకాలంలో మాత్రమే వీరికి పనులు ఎక్కువగా ఉంటాయి.

రకాన్ని బట్టి ఆదాయం

భవనాలకు రంగులు అద్దే పని వివిధ రకాలుగా ఉంటుంది. కాంట్రాక్టు పద్ధతిలో పెయింటింగ్ వేయడంలో.. మెటీరియల్‌తో పాటు, అడుగు రూ.30 చొప్పున తీసుకుంటారు. వాల్‌కేర్ పని మరొకటి, ఈ పని కొంత లాభదాయకంగా ఉంటుంది. దీనికి అడుగుకు రూ.12 నుంచి రూ.27 తీసుకుంటారు.

పనులు ఎక్కువగా దొరికాయి



గత ప్రభుత్వంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణంతో పనులు ఎక్కువగా దొరికాయి. దీనికితోడు ప్రైవేటు పనులు కూడా ఉండటంతో ఆశాజనకమైన ఆదాయం వచ్చింది. కార్మిక చట్టాల అమలుతో మాకు మంచి ప్రయోజనాలు వచ్చాయి. వైఎస్సార్ బీమా పథకం ద్వారా ప్రమాదాలకు గురైన కార్మికులకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు అందాయి.

– కుందేటి కిషోర్, పెయింటర్, బూరుగుపూడి

పండగల్లో పనులు ఎక్కువ



వేసవి, శీతాకాలంలో మాత్రమే ఎక్కువ పనులుంటాయి. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో పనులు లేకపోవడంతో పస్తులుండాల్సిన పరిస్థితి. డిసెంబర్‌లో క్రిస్మస్, జనవరిలో సంక్రాంతి పండగల సందర్భంగా పనులు దొరుకుతాయి. మిగిలిన రోజుల్లో పెళ్లిళ్లు, శుభ కార్యాలుంటే పనులు ఫర్వాలేదు.

– పలివెల బన్ను, పెయింటర్, కోరుకొండ

సెంట్రల్ జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి

కంబాలచెరువు: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ మంగళవారం సందర్శించారు. కారాగారంలో ఖైదీలకు ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ప్లంబింగ్, వెల్డింగ్, ఇతర నైపుణ్యాలలో శిక్షణ పొందుతున్న ఖైదీలతో మాట్లాడారు. వారు విడుదలైన తరువాత జీవనోపాధికి ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వారి జీవనోపాధికి ఇంకా అదనపు శిక్షణలు అవసరమైతే అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలను, సమస్యలను తెలుసుకున్నారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలను వారికి వివరించారు, ఎలాంటి న్యాయ సాయం అవసరమున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర కారాగారం జైలర్ ఆర్.శ్రీనివాసులు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, కేంద్ర కారాగారం అధికారులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పూలదండలతో అలంకరించారు.

నర్సరీల్లో ఎగుమతులు ప్రారంభం


కడియపులంకలో మొక్కలు ఎగుమతి చేస్తున్న కూలీలు

కడియం: మండలంలో విస్తరించి ఉన్న నర్సరీల నుంచి వివిధ ప్రాంతాలకు మొక్కల ఎగుమతులు ప్రారంభమయ్యాయి. వాతావరణం అనుకూలించి, వర్షాలు కూడా మొదలు కావడంతో మొక్కల కొనుగోలుదారులు కడియం ప్రాంతానికి వస్తున్నారని స్థానిక నర్సరీ రైతులు తెలిపారు. మండలంలోని 11 గ్రామాల పరిధిలోనూ 7,500 హెక్టార్లలో సుమారు రెండు వేలకు పైగా నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ వివిధ రకాల ఫల, పుష్ప, అలంకరణ మొక్కలు రూ.5 నుంచి రూ.లక్ష వరకు లభిస్తాయి. దీంతో దేశవ్యాప్తంగా కడియం ప్రాంత నర్సరీల నుంచి మొక్కలను కొనుగోలు చేసి తీసుకువెళుతుంటారు. జూన్ రెండో వారం నుంచి మొక్కల ఎగుమతులు ప్రారంభమవుతాయి. దీంతో రవాణా వాహనాలు, కూలీలతో కడియం మండలంలోని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రస్తుతం అలంకరణ మొక్కల ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానిక రైతులు తెలిపారు. సీజన్ ఆశాజనకంగా ప్రారంభం కావడంపై రైతులు, కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు తీసుకువెళ్లే ప్రాంతాల్లో కూడా తగినంత వర్షాలు ఉంటేనే మొక్కల ఎగుమతులు ఊపందుకుంటాయని వారు వివరించారు. తోటలను సాగు చేసే రైతులతో పాటు, లేఔట్లు, ల్యాండ్ స్కేపర్లు కూడా కడియం ప్రాంతం నుంచి మొక్కలను తీసుకువెళతారు.

లారీ క్లీనర్ అదృశ్యంపై కేసు


గుమ్మడి రాజ్‌కుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: దివాన్‌చెరువులో లారీ దిగిన తన అన్నయ్య ఇంటికి రాలేదని జి.యర్రంపాలేనికి చెందిన గుమ్మడి మూర్తిరాజు మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, రాజానగరం మండలం జి.యర్రంపాలేనికి చెందిన 40 ఏళ్ల గుమ్మడి రాజ్‌కుమార్ లారీపై క్లీనర్‌గా పనిచేస్తుంటాడు. గత నెల 31న రాజ్‌కుమార్ లారీపై కేరళ వెళ్లి, అక్కడి నుంచి తమిళనాడు వెళ్లాడు. అక్కడ రాజ్‌కుమార్‌కు మరొకరితో పరిచయం ఏర్పడింది. వేరే లారీపై అతడు ఈ నెల 4న తిరిగి రాజమహేంద్రవరానికి వచ్చేశాడు. బియ్యం లోడుతో విశాఖపట్నం వెళ్తున్నానని సోదరుడు మూర్తిరాజుకు ఫోన్ చేసి చెప్పాడు. కానీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బియ్యం లారీ డ్రైవర్ కడగల వెంకట సుబ్బారావును ప్రశ్నించగా, ఈ నెల 6న తిరుగు ప్రయాణంలో దివాన్‌చెరువు సెంటర్‌లో దిగిపోయాడని చెప్పాడు. వివిధ ప్రాంతాల్లో వెతికినప్పటికీ రాజ్‌కుమార్ ఆచూకీ లభించలేదు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కాంతులతో ముస్తాబు

- ప్రమాణ స్వీకారానికి హాజరయ్యే వారికి ఏర్పాట్లు
- కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నూతన ప్రభుత్వ ఏర్పాటు సందర్భంగా జిల్లావ్యాప్తంగా విద్యుత్ కాంతులతో ముస్తాబు చేస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. అలాగే జిల్లా నుంచి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతున్న వారి కోసం తగిన ఏర్పాట్లు చేశామని చెప్పారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొనే ప్రముఖులకు వీవీపీ పాసులు జారీ చేశామని, సంబంధిత శాసన సభ్యుల ద్వారా వాటిని అందించాల్సి ఉంటుందన్నారు. ప్రధాని ఈ వేడుకల్లో పాల్గొననున్నట్టు చెప్పారు. జిల్లా నుంచి వెళ్లే వారు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు రావాల్సి ఉంటుందన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో,, మండల హెడ్ క్వార్టర్స్‌లో నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం 29 ప్రదేశాల్లో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. కలెక్టరేట్, కార్పొరేషన్, ఆర్డీవో, పశు సంవర్ధక శాఖ కార్యాలయాల్లో, కలెక్టర్ క్యాంపు కార్యాలయం, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, ఆర్ట్స్ కళాశాల, నన్నయ యూనివర్సిటీ, నందం గనిరాజు సెంటర్, వై.జంక్షన్, లాలా చెరువు తదితర ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఆయా కార్యాలయాల్లో, ముఖ్య కూడళ్లలో విద్యుత్ కాంతులు వెదజల్లేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీఎం ప్రమాణ స్వీకార వీక్షణకు..

పెదపూడి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో స్థానిక మార్కెట్ సెంటర్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించామన్నారు.

ప్రత్యక్ష ప్రసారానికి..

రాజానగరం: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటులో భాగంగా బుధవారం ఉదయం ముఖ్యమంత్రి, మంత్రులు చేసే ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ జ్యోతిర్మయి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రజా పరిషత్ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు.

అశ్రద్ధ చేస్తే మలేరియాతో ప్రాణాపాయం

సీతానగరం: జ్వరమే కదా అని మలేరియాను అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం తప్పదని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఏసురాణి అన్నారు. మండల కేంద్రమైన సీతానగరంలో మలేరియా వ్యాధిపై మంగళవారం అవగాహన ర్యాలీని ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి పాత పోలీస్ స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా నాలుగు బొమ్మల సెంటర్ వరకు అవగాహన ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఏసురాణి మాట్లాడుతూ మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం ద్వారా వస్తుందన్నారు. ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే క్రమంగా మెదడుకు సోకి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి డొక్కులు లేకుండా చూసుకోవాలని, నీటి, పూల కుండీల్లో నీరు మూడు రోజులు మించి నిల్వ లేకుండా చూడాలన్నారు. ఇంటి పరిసరాల్లోను, జనావాసాలకు దగ్గరలో నీటి గుంతలు లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. కొద్దిపాటి జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా, వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ పి.వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, ఎంపీహెచ్ఎస్‌లు కె.సుధాకర్, జి.దైవకృప, స్టాఫ్ నర్స్ రేవతి, సీనియర్ అసిస్టెంట్ స్వరూపారాణి, హెల్త్ అసిస్టెంట్ నందీశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు సౌజన్య, జి.స్వరూప, ఏఎన్ఎంలు ఎస్‌కే మున్నీసా, ఎస్‌కే సలీమా, కృష్ణవేణి, విశాలాక్షి, ఎల్‌టీ శిల్ప సౌందర్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ ఏసురాణి, ఇతర సిబ్బంది

మొక్కలు నాటడంలో భాగస్వాములు కావాలి

రాజానగరం: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఉగాది స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఔత్సాహికులంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. దివాన్‌చెరువులోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద మంగళవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. నైరుతి రుతు పవనాలు ప్రవేశించి, వర్షాలు పడుతున్న ప్రస్తుత సమయంలో మొక్కలు నాటి, సంరక్షించడం శ్రేయస్కరమన్నారు. వేసవిలో ఉష్ణతాపాన్ని చాలావరకు నివారించవచ్చని చెప్పారు.

మబ్బుతో సరి.. వానలేవీ మరి..!

- జూన్‌లో కూడా ఉక్కపోతతో ఇక్కట్లు
- ఆశించిన స్థాయిలో తగ్గని పగటి ఉష్ణోగ్రత

సీటీఆర్ఐ: గత ఏడాది జూన్‌లో వద్దంటే వర్షాలు. వరుణుడు కరుణించడంతో రైతులు ఉత్సాహంగా రబీ పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించారు. కానీ.. ఈ ఏడాది వరుణుడి జాడ అంతంత మాత్రమే. ఈ నెల 3వ తేదీన రాష్ట్రంలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. జూన్ 11 వచ్చినా కానరావడం లేదు. వర్షాలతో చల్లబడాల్సిన వాతావరణం భానుడి భగభగలు తగ్గలేదనిపిస్తోంది. ఏప్రిల్, మే నెలల్లో సూర్యప్రతాపంతో అల్లాడిన ప్రజలు.. జూన్‌లో వర్షాలతో సేదతీరవచ్చని ఆశించారు. అయితే రోజురోజుకూ ఉష్ణోగ్రతల మాట అటుంచితే, ఉక్కపోత కూడా తోడవ్వడంతో చిన్నపిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, రాత్రి పూటా ఉక్కపోత తగ్గకపోవడంతో ఏసీలు, కూలర్ల వినియోగం ఇంకా కొనసాగుతూనే ఉంది. జూన్ తొలి వారంలోనే వర్షాలు ప్రారంభమై, రెండో వారంలోకి వచ్చేటప్పటికీ పూర్తిగా వాతావరణం చల్లబడాలి. కానీ జూన్‌లోనూ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మంగళవారం ఉష్ణోగ్రత 35 డిగ్రీలు ఉన్నా, గాలిలో తేమ 70 శాతం ఉండటంతో ప్రజలంతా అల్లాడిపోయారు. చిరు వ్యాపారులు, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారంతా చెట్ల నీడన సేదతీరడం కనిపించింది. సాయంత్రం వేళలో గోదావరి గట్టును ఆశ్రయించి నగర ప్రజలు సేదతీరుతున్నారు. మరో మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో, ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు.


జన సందోహం కానరాని వై.జంక్షన్ ప్రాంతం

బడుల్లో కానుకల జల్లు

- విద్యా కానుక కిట్ల పంపిణీకి అధికారుల కసరత్తు
- మండల కార్యాలయాలకు చేరిన పుస్తకాలు
- నాడు-నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు

రాజమహేంద్రవరం రూరల్: ఒకప్పుడు చదువు 'కొనా'లంటే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలే దిక్కు అన్నట్టుగా ఉండేవి. సర్కారీ బడులంటే.. విద్యా ప్రమాణాల మాటు పక్కనపెడితే.. పిల్లలకు కనీస సౌకర్యాలు కనిపించేవి కావు. విరిగిన బెంచీలు, అరిగిన బ్లాక్ బోర్డులు.. వచ్చామా, వెళ్లామా అన్నట్టుగా ఉండే మాస్టార్ల తీరు.. పాఠాలు అర్థం కాక బేలగా చూసే విద్యార్థుల చూపులు.. ఇవి ఒకప్పటి ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి. ఇప్పుడు సీనంతా రివర్స్ అయింది. విద్యా వ్యవస్థలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు సర్కారు బడులు కాస్తా.. కార్పొరేట్ విద్యాసంస్థలను మించిపోయాయి. పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలతో పాటు, విద్యా ప్రమాణాల్లోనూ శ్రేష్ఠమైన ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలోనే అదే ఒరవడిని ఈ ఏడాది కూడా కొనసాగించేందుకు అధికార యంత్రాంగం విద్యార్థులకు 'విద్యా కానుక'లతో స్వాగతం పలుకుతున్నారు.

పేదలకు నాణ్యమైన విద్యను అందించినప్పుడే సమ సమాజం ఏర్పడుతుందని నమ్మిన గత ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. నాడు-నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. గత ఐదేళ్లుగా బడి తెరిచిన రోజే విద్యా కానుక పేరుతో ప్రభుత్వం పుస్తకాలు, యూనిఫారం, బ్యాగులు, షూస్, బెల్టులు అందించింది. దీంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల చేరిక కూడా గణనీయంగా పెరిగింది.

చేరిన పుస్తకాలు

విద్యార్థుల కోసం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇప్పటికే మండల విద్యా వనరుల కేంద్రానికి చేరాయి. వీటితో పాటు యూనిఫారం, బ్యాగులు, షూస్, బెల్టులు ఇంకా రావాల్సి ఉంది. అవి కూడా రెండు రోజుల్లో మండల విద్యా వనరుల కేంద్రానికి రానున్నట్టు అధికారులు చెబుతున్నారు. అన్ని కలిపి బడి తెరిచిన రెండు రోజుల్లో విద్యార్థులకు అందజేయనున్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 9,551 మంది విద్యార్థులకు 85,322 పాఠ్య పుస్తకాలు కావాల్సి ఉండగా, 63,708 వచ్చాయి. అలాగే కడియం మండలంలో 4,943 మంది విద్యార్థులకు గాను 46,318 పాఠ్య పుస్తకాలు కావాల్సి ఉండగా, 38,073 మండల విద్యా వనరుల కేంద్రానికి చేరాయి. వీటితో పాటు నోటు పుస్తకాలు పూర్తి స్థాయిలో చేరుకున్నాయి.


మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న మండల విద్యా శాఖాధికారులు


శాటిలైట్‌సిటీలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పిల్లల చేరికపై ప్రత్యేక దృష్టి

పదో తరగతి 2023-24 విద్యా సంవత్సరం పరీక్షా ఫలితాల్లో నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. దీంతో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీలు ముద్రించి మరీ విస్తృత ప్రచారం చేపట్టారు. పాఠశాలల్లో ఉన్న వసతులతో పాటు, ఉత్తమ విద్యా బోధన అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.